సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం । 26 । జూన్ । 2024



భరోసా ఏదీ?

నిరుద్యోగి మర్రి ప్రవళిక ఆత్మహత్య సమయంలో ప్రతిపక్షంలో ఉండి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆ కుటుంబంవైపు చూడడం లేదు. - 8లో▸



డీన్ అపాయింట్ డిలే!

కేయూ సైన్స్ డీన్ నియామకంలో యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో యూనివర్సిటీలోని ప్రొఫెసర్లలో చర్చనీయాంశంగా మారింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1°/26.2°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



భూపాలపల్లి: కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న రాహుల్ శర్మ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జడ్జిని కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి నారాయణబాబు చాంబర్‌లో జిల్లాలో పరిపాలన, న్యాయ సంబంధ విషయాలపై ఇరువురు చర్చించుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత



భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్(మాజీ వీఆర్‌ఓ)గా పనిచేస్తూ ఇటీవల మరణించిన పంగ రమేష్ కుటుంబానికి తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ తరపున మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. రమేష్ కుటుంబానికి రూ.పది వేలు అందజేసి సంఘం తరపున ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు బండి శ్రీనివాస్, మాజీ వీఆర్‌వోలు నారాయణ, తిరుపతిరెడ్డి, కల్ రాం, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రమోషన్ల తరువాతే ఎస్జీటీల బదిలీ



భూపాలపల్లి అర్బన్: జిల్లాలో మిగిలిన స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్లు ఇచ్చిన తరువాతే ఎస్జీటీల బదిలీలు నిర్వహించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎస్‌ఏ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ప్రమోషన్లలో కొందరు ఉపాధ్యాయులు ఒక్కటి కంటే ఎక్కువ సబ్జెక్ట్‌లో ప్రమోషన్లు పొందారని, వారు ఒక్క సబ్జెక్ట్‌లో జాయినింగ్ కాగా మిగిలిన ఎస్‌ఏ పోస్టులు అధిక సంఖ్యలో ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేసిన తరువాతే ఎస్జీటీల బదిలీలు నిర్వహించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ములుకల్ల తిరుపతి, పత్తి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

కాజీపేట అర్బన్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ప్రధాన ద్వారం ఎదుట మంగళవారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. కాంట్రాక్టర్ 80 మంది నిట్ ఔట్‌సోర్సింగ్, బీఎంఎస్ ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించట్లేదని, కొందరు ఉద్యోగులను అకారణంగా తీసేశారని తక్షణమే వేతనాలు చెల్లించాలని నినదించారు. తొలగించిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కాగా.. సదరు కాంట్రాక్టర్ ఉద్యోగులతో చర్చించి వేతనాల్ని, తిరిగి ఉద్యోగులను తీసుకునే విషయంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

వరంగల్ స్టేషన్ ఎదుట త్వరలో లోకోమోటివ్

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట సికింద్రాబాద్, కాచిగూడ, కాజీపేట స్టేషన్ల మాదిరిగా స్టీమ్ లోకోమోటివ్(ఇంజిన్) త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భరతేశ్‌కుమార్ జైన్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్ని ఆయన సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రత్యేక రైలులో కొండపల్లి నుంచి విండో ఇన్‌స్పెక్షన్ చేసుకుంటూ మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లు తనిఖీ చేస్తూ.. వరంగల్ రైల్వేస్టేషన్‌కు మంగళవారం సాయంత్రం 6 గంటలకు చేరుకున్నారు. మొదటి ప్లాట్ ఫాంపై ఉన్న ఓ క్యాటరింగ్ స్టాల్‌ను పరిశీలించారు. రిజర్వ్ లాంజ్, దాని పక్కన ఉన్న రూమ్‌ను, నిర్మాణంలో ఉన్న సాధారణ వెయింటింగ్ హాల్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వంగిపోతుర్రు..



విద్యార్థులకు పుస్తకాల బరువు
- ప్రైవేట్ స్కూళ్లలో మరీ ఎక్కువ..
- మోయలేక ఇబ్బందులు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు..

భూపాలపల్లి అర్బన్: బాల్యం భవిష్యత్‌పై పుస్తకాల భారం పెరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ సొంత సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో మోతెక్కిస్తున్నారు. దీంతో బ్యాగుల బరువు మోయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలకు తోడు టిఫిన్ బాక్స్, వాటర్‌బాటిల్, బూట్లు తదితర వస్తువులు మరింత భారంగా మారుతున్నాయి. పిల్లల బాధ చూడలేక చాలామంది తల్లిదండ్రులు పాఠశాల వరకు బ్యాగులు మోసుకెళ్లి దిగబెట్టి వస్తున్నారు. పుస్తకాల బరువుపై ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 72 ఉన్నాయి. వీటిలో సుమారు 15వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్స్‌తో పాటు ఒక రఫ్‌బుక్ ఉండేది. ప్రస్తుతం సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తోపాటు గైడ్లు, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలని స్కూల్ బ్యాగుల్లో కిలోల కొద్దీ పుస్తకాలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 6నుంచి 12కిలోల బరువైన బ్యాగులు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు 12నుంచి 17కిలోల బ్యాగులను ప్రతి రోజు వీపు మీద మోస్తున్నారు. రోజు ఇంతింత బరువులు మోయడం, ఒకటి, రెండు అంతస్తుల మోడలు ఎక్కి క్లాస్‌రూం వరకు వెళ్లడం కారణంగా చాలామంది పిల్లలు వెన్నునొప్పి, జాయింట్ పెయిన్స్ బారినపడుతున్నారు. ఇది విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

ఒక్కో తరగతికి 30 బుక్స్‌పైనే..

జిల్లాలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రైమరీకి 15నుంచి 25 పుస్తకాలు ఉండగా హైయర్‌లో 30 పుస్తకాలకు పైగా ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతిలో 32 రకాల పుస్తకాలను పాఠశాలలోనే ఇచ్చారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, డ్రాయింగ్, స్టోరీ, డైరీ, ఇతర వర్కుబుక్‌లను ఇచ్చారు.

ప్రభుత్వ మార్గదర్శకాలివే..

చిన్నారులకు కిలోల కొద్దీ బ్యాగుల మోతను తగ్గించేలా రాష్ట్ర విద్యాశాఖ 2020 సంవత్సరంలో మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకటి, రెండో తరగతుల పుస్తకాల బరువు బ్యాగుతో సహా కిలోన్నర మాత్రమే ఉండాలి. ప్రస్తుతం జిల్లాలోని పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండు తరగతుల పిల్లల బ్యాగులే సుమారు 4 నుంచి 8 కిలోల బరువు ఉంటున్నాయి. మూడు, నాలుగు, ఐదు తరగతులకు 3 కిలోలు, ఆరు, ఏడు తరగతులకు 4 కిలోలు, ఎనిమిది తొమ్మిది, పదో తరగతులకు నాలుగున్నర నుంచి 5 కిలోల వరకు మాత్రమే బ్యాగు బరువు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఈ నిబంధనలను అమలు చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

అమలు చేయాల్సిందిలా..

ఆరు, ఏడు తరగతులకు మూడు లాంగ్వేజ్ బుక్స్‌తో పాటు గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం సహా మొత్తం ఆరు పుస్తకాలే ఉండాలి. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతులకు ఆరు పుస్తకాలతో పాటు జీవశాస్త్రం కలిపి ఏడు పాఠ్యపుస్తకాలు ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు 200 పేజీల నోట్‌బుక్ మాత్రమే ఉపయోగించాలి. వాటిని ఎఫ్‌ఏలకు, స్లిప్‌టెస్టులకు వినియోగించాలి. ఇవి కూడా రోజు తీసుకురావాల్సిన అవసరం లేదు. పాఠ్యాంశాల చివరన ఉన్న ఎక్సర్‌సైజ్‌లను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాలల్లోనే పూర్తిచేయాలి. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్లను కేటాయించాలి. ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు హోంవర్క్ కోసం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు కేటాయించేలా ప్రణాళిక ఉండాలి. ఏ సబ్జెక్టుకు ఏ రోజు అనేది ఉపాధ్యాయుల ఏయే పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్ తెచ్చుకోవాలో టీచర్లు ముందుగానే చెప్పాలి. స్టేట్ సిలబస్‌ను అమలుచేసే అన్ని పాఠశాలలు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్ణయించిన పుస్తకాలనే వినియోగించాలి.

పిల్లల ఎదుగుదలపై భారం..



పిల్లలపై చిన్నతనంలోనే పుస్తకాల భారం మోపడం వలన వారి ఎదుగుదలపై భారం పడుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా గమనించాలి. వారిపై పుస్తకాల భారం మోపొద్దు. అవసరం ఉన్న పుస్తకాలను మాత్రమే ఇంటికి తీసుకువచ్చేలా చూసుకోవాలి. వెన్నెముక, బుజాల నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

- డాక్టర్ నవీన్‌కుమార్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి..



ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. పాఠశాలలకు అవసరమైన పుస్తకాలు మాత్రమే తీసుకువెళ్లేలా చూడాలి. పుస్తకాలు పదులు, ఇరువై సంఖ్యలో ఉంటున్నందున అధిక బరువుతో పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో విద్యాశాఖ మొద్దు నిద్రలో ఉన్నట్లు కనిపిస్తుంది. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలి.

- సోత్కు ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కాళేశ్వరాలయంలో కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని కలెక్టర్ రాహుల్‌శర్మ దర్శించుకున్నారు. మంగళవారం ఆయన కాళేశ్వరాలయం రాజగోపురం వద్దకు రాగా ఆలయ అధికారులు మంగళవాయిద్యాలు, వేదపంతుల మంత్రోచ్చరణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. కలెక్టర్ ముందుగా శ్రీగణపతిస్వామివారికి పూజచేశారు. స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజ చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆశీర్వచన వేదిక వద్ద కలెక్టర్‌ను ఈఓ మారుతి శాలువాతో సన్మానించారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మమత, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, అన్నారం ఈఈ యాదగిరి ఉన్నారు.

తుప్పపట్టిన పోస్ట్‌బాక్స్



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయం సమీపంలో ఉత్తరాలు వేసే పోస్టు బాక్స్ తుప్పుపట్టింది. ఒక్కోచోట పోస్టుబాక్స్‌లు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు ఊళ్లోకి పోస్టుమాన్ వస్తే 'మాకేమైనా ఉత్తరం వచ్చిందా! ఎవ్వరికి వచ్చింది' అంటూ ఆయన వెంట పడేవారు. కానీ ప్రస్తుతం ఉత్తరాలు వేసేవారు, అందుకునే వారు లేరు. ఇప్పుడంతా వాట్సప్, మెయిల్స్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్‌ల జోరు నడుస్తోంది. సోషల్ మీడియా పెరుగుతుండడంతో ఉత్తరాలు కనుమరుగయ్యాయి. దీంతో పోస్టుబాక్స్‌ల వైపు ఎవ్వరూ కన్నెత్తి చూడడం లేదు.

వంద ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

30 ఎకరాల్లో పలు విద్యాసంస్థలు
- త్వరలోనే జిల్లా ఆస్పత్రికి ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం
- భూసేకరణలో జాప్యంతో రింగ్‌రోడ్ పనులు కొంత ఆలస్యం
- హామీలు నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి: గణపురం మండలంలోని గాంధీనగర్ వద్ద వంద ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, తద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు వచ్చే నెల మొదటి వారంలో గాంధీనగర్ వద్ద ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడే 30 ఎకరాల్లో పలు విద్యా సంస్థలను నిర్మించబోతున్నామని, ఏడాదిలోగా గాంధీనగర్ రూపురేఖలు మారుతాయన్నారు. భూపాలపల్లి పట్టణ ప్రధాన రహదారికి ఒకవైపు మాత్రమే ప్రైవేటు స్థలాలు ఉన్నందున పట్టణ అభివృద్ధిలో కొంత ఆలస్యం జరుగుతుందన్నారు. ఇరువైపులా పట్టణం విస్తరిస్తేనే వరంగల్ తరువాతి పట్టణంగా నిలుస్తుందన్నారు. ఇందుకోసం 171 సర్వేనంబర్‌లోని 380 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వానికి వచ్చేలా చేసి, అక్కడ కోర్టు భవనాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయం తదితర ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక ప్రభుత్వం ఆధ్వర్యంలో లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయిస్తే భారీగా ఆదాయం రావడమే కాక నిర్మాణాలు శరవేగంగా జరిగి భూపాలపల్లికి కళ వస్తుందన్నారు. భూపాలపల్లి రింగ్‌రోడ్డు భూసేకరణలో కొంత ఆలస్యం జరుగుతుందని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభం అవుతాయన్నారు. రేగొండ మండలంలోని బాగిర్థిపేట క్రాస్ నుంచి కొడవటంచ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు చేయించానని అన్నారు. గత వర్షాకాలంలో అధిక వర్షాలు కురిసి చెరువుల కట్టలు తెగిపోగా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్నాక, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రూ.58 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. జర్నలిస్టు మిత్రులు అడగపోయినప్పటికీ జిల్లాకేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేయించానని, అవి సరిపోకపోతే మళ్లీ నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. టేకుమట్ల బ్రిడ్జి మరమ్మతుల కోసం రూ. 5.80 కోట్లు మంజూరు చేయించానని, అక్కడ ఇప్పుడు 24గంటలు పనులు సాగుతున్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని జిల్లాకేంద్రంలోని కొందరు డబ్బులు వసూలు చేశారని, నెల రోజుల్లో ఆ డబ్బులను వాపస్ ఇవ్వాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుచేస్తే తన పక్కన ఉన్నోడినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, క్యాతరాజు సాంబమూర్తి, అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్, బుర్ర కొమురయ్య, బాలగోని రమేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రతిపాదనలు

కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి: వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



కాటారం: నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి: జిల్లాలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ అంగన్‌వాడీల బలోపేతం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల నమోదు తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లాలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. వృద్ధాశ్రమాలు అందుబాటులో లేని జిల్లాల్లో భవన నిర్మాణానికి భూమిని గుర్తించాలని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం స్టేజ్–2 పనుల్లో వేగం పెంచాలి

కాటారం/కాళేశ్వరం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన గారెపల్లి స్టేజ్–2 పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మహదేవపూర్, కాటారం మండలాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. గోదావరి, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించారు. లక్ష్మీపంపుహౌస్ కార్యాలయంలో కాసేపు అధికారులతో మ్యాప్ ద్వార చిన్నకాళేశ్వరం వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా మెట్‌పల్లి పంచాయతీలోని బీరసాగర్ వద్ద జరుగుతున్న చిన్న కాళేశ్వరం పంప్‌హౌస్ మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాటారం మండల కేంద్రంలోని గారెపల్లి వద్ద కొనసాగుతున్న ఎత్తిపోతల పథకం స్టేజ్–2 పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ఏడాది పంటలకు సాగు నీరందించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతిరావు, కాటారం తహసీల్దార్ నాగరాజు, మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఏఈఈ విజయ్‌కుమార్, మెగా ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ పాషా ఉన్నారు.

నిట్‌తో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒప్పందం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో బేగంపేట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ బేగంపేట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా.. డైరెక్టర్ పీకే హజారి నిట్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. నిట్ విద్యార్థులకు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజనీర్లకు పరిశోధనలకుగాను ఈఒప్పందం తోడ్పడుతుందని తెలిపారు.

కొనసాగుతున్న 'జూడా'ల సమ్మె

ఎంజీఎం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జూనియర్ వైద్యులు ఓపీ విధులు బహిష్కరించి చేపడుతున్న నిరసన కార్యక్రమాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నిరసనలో భాగంలో వైద్యవిద్యార్థులు కాకతీయ మెడికల్ కళాశాల నుంచి ఎంజీఎం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జూనియర్ వైద్యుల ప్రతినిధులు డాక్టర్ శ్రీనాథ్, అజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో జరిపిన చర్చలు అసంతృప్తిగా ముగియడంతో సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. స్టైఫండ్స్, విద్యార్థుల సమస్యలతో పాటు ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు సంబంధించిన ఎనిమిది ప్రధాన డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేఎంసీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో వారం క్రితం ఓ పీజీ విద్యార్థికి జరిగిన ప్రమాదంలో గాయాలయ్యాయని, అవి మానకముందే మంగళవారం మరో విద్యార్థి రోడ్డు బాగాలేక బైక్ నుంచి పడి గాయాలపాలైనట్లు తెలిపారు. ఈసందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

న్యాయం జరిగేలా పోలీసింగ్

- అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎస్పీ కిరణ్‌ఖరే



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

భూపాలపల్లి: సామాన్యుడిని దృష్టిలో ఉంచుకొని వారికి భరోసా, న్యాయం జరిగేలా పోలీసింగ్ ఉండాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన పోలీసులు అనైతిక చర్యలకు పాల్పడితే, క్రమశిక్షణ చర్యలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారులు శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవరించాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ను పెంపొందించి, కేసుల దర్యాప్తును పూర్తిచేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణను త్వరగా పూర్తిచేసి చార్జీషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతీ కేసుకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, లక్ష్యం నిర్దేశించుకొని విధులు నిర్వహించాలన్నారు. చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని, జిల్లా పరిధిలో గంజాయి రవాణాదారులు, వినియోగదారులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, చెడు పనులను ఎవరు ప్రోత్సహించినా ఉపేక్షించేదిలేదని అన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి, కాటారం, సైబర్ క్రైమ్ డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, సుభాష్‌బాబు, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

ప్రజలు, యువత విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో యాంటి డ్రగ్ అవగాహన పోస్టర్‌ను డీఎస్పీలతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు వాడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అటువంటి అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. యాంటి డ్రగ్స్‌పై చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, కాటారం, సైబర్ క్రైమ్ డీఎస్పీలు, సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, సుభాష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు హాస్టల్ వసతి


మహేశ్‌బాబు

హన్మకొండ కల్చరల్ : హాస్టల్ వసతి కోసం ఆర్యవైశ్య విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని వాసవి ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ గట్టు మహేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో వాసవి ఆర్య వైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా ఆధ్వర్యంలో నిర్మించిన వసతి గృహంలో ప్రవేశాలు జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. హాస్టల్‌లో ప్రవేశాల కోసం డిగ్రీ, పీజీ చదివే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అర్హులైన వైశ్య ప్రతిభావంతులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులను ఎంపిక చేసి ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 80998 39966, 83417 85462 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

● తీర్పు వెలువరించిన జడ్జి బి.అపర్ణాదేవి



వరంగల్ లీగల్: మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెందిన వెంకటేష్‌కు 2013లో కంఠాత్మకూర్‌కు చెందిన జెక్కి ఎల్లయ్య కూతురు స్వాతితో వివాహం జరిగింది. హనుమకొండ చౌరస్తాలో ఓ మెడికల్ షాపులో గుమస్తాగా పనిచేసే వెంకటేష్.. భార్యతో నిత్యం గొడవ పడే వాడు. దీనిపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. పెద్దలు సర్దుబాటు చేసి పంపించినా వెంకటేష్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020, అక్టోబర్ 06న ఎల్లయ్య తన కూతురు ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం తన ఇంటికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో వెంకటేష్.. తన మామ ఎల్లయ్యకు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడుగగా హసన్‌పర్తి సమీపంలోని నల్లగుట్ట వద్ద ఉన్నానని తెలిపాడు. మామ వద్దకు చేరుకున్న అనంతరం ఇద్దరూ మద్యం సేవించారు. సాయంత్రం కల్లు కోసం హసన్‌పర్తి చెరువు వద్ద ఉన్న తాటి వనానికి వెళ్లారు. అక్కడ వెంకటేష్, స్వాతి (దంపతులు) సమస్యపై ఎల్లయ్య మాట్లాడుతూ 'నా కూతురును ఇబ్బంది పెట్టకు.. మంచిగా చూసుకో' అని తెలుపగా కోపోద్రిక్తుడైన వెంకటేష్ మామపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో తన బైక్ వెంట తెచ్చుకున్న గొడ్డలితో ఎల్లయ్య తన అల్లుడిపై దాడికి యత్నించాడు. అప్రమత్తమైన వెంకటేష్.. అదే గొడ్డలితో ఎల్లయ్యను కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగి స్పృహ తప్పాడు. దీంతో మామను చెరువులో పడేశాడు. మృతి చెందాడనుకుని నిర్ధారించుకున్న అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాలని ఉద్దేశంతో తన మామ బైక్‌కు దాడికి ఉపయోగించిన గొడ్డలిని తగిలించి చెరువులో పడేశాడు. అనంతరం ఏమి తెలియనట్లు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో చెల్లి ఇంటికి వెళ్లిన తండ్రి తిరిగి రాకపోవడంతో ఎల్లయ్య కుమారుడు నాగరాజు హసన్‌పర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 2020, అక్టోబర్ 09వ తేదీన ఉదయం చెరువులో మృతదేహం తేలిందని పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న నాగరాజు ఎంజీఎం మార్చురీకి వెళ్లి అది తన తండ్రి శవంగా గుర్తించాడు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు తెలిపాడు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో ఎలాగైనా తనను అరెస్ట్ చేస్తారని భావించిన వెంకటేష్.. తన బంధువుల ద్వారా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో నేరస్తుడు పోతరాజు వెంకటేష్‌కు జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. ఈ కేసును సీఐలు జె.సురేశ్, కె.శ్రీధర్‌రావు, ఎస్సై రాజ్‌కుమార్, పరిశోధించారు. హెడ్‌కానిస్టేబుల్ వి.రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ప్రవళిక కుటుంబానికి భరోసా ఏదీ?

నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ అందరి నోట్లో ఇదే పేరు

- దుగ్గొండి మండలం బిక్కాజిపేటకు ప్రముఖుల రాక
- ప్రియాంకగాంధీ దూతగా వచ్చిన అప్పటి యూపీ ఎంపీ డాలీశర్మ
- మీకు అండగా ఉంటామంటూ మా నేత పంపారని సందేశం
- ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుడు భావోద్వేగ ట్వీట్
- న్యాయం చేయాలంటూ ప్రవళిక తల్లిదండ్రుల వేడుకోలు
- కూలీ పనులకు వెళ్తూ జీవనం వెళ్లదీస్తూ కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం


ప్రవళిక కుటుంబాన్ని ఓదారుస్తున్న ఉత్తరప్రదేశ్ ఎంపీ డాలీశర్మ(ఫైల్)


ప్రవళిక చిత్రపటం పట్టుకొని ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు

సాక్షి, వరంగల్/దుగ్గొండి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ మర్రి ప్రవళిక ఆత్మహత్య రాష్ట్రాన్నే కాదు దేశంలోనే సంచలనంగా మారింది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి , బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ల నోటి వెంట రాజకీయ ఎన్నికల ప్రచారంలో ఆమె పేరు మార్మోగింది. అదే సమయంలో ప్రవళిక కుటుంబాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదుకోవాలని, ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడంతో పాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అదే సమయంలో రాబోయే తమ ప్రభుత్వం ద్వారా ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని బాహాటంగానే ప్రకటించాయి. అలా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపేటకు చెందిన ప్రవళిక పేరును వాడుకొని ఆయా పార్టీలు మద్దతు కూడగట్టుకున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉండి ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోవాలన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు కనీసం ఇప్పుడు ఆ కుటుంబం వైపు చూడకపోవడంతో కన్నీరుమున్నీరవుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగిన ప్రవళిక తండ్రి విసిగివేసారి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 28న ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వరంగల్‌కు రానున్న సందర్భంలో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అసలేం జరిగిందంటే..

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో కోచింగ్ తీసుకుంటున్న క్రమంలో పోటీ పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో విరక్తి చెందిన ఆమె 2023 అక్టోబర్ 13న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక మృతితో అక్కడే వివిధ కోచింగ్ సెంటర్లలోని నిరుద్యోగ యువతీ యువకులు నిరసనకు దిగారు. అప్రమత్తమైన అప్పటి ప్రభుత్వం ప్రవళిక మృతదేహాన్ని భారీ పోలీసు బందోబస్తు మధ్య స్వగ్రామం బిక్కాజిపల్లి గ్రామానికి తీసుకువచ్చి వందలాది మంది పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించింది. అంత్యక్రియల సందర్భంలో వేలాది మంది విద్యార్థులు వచ్చి ఆందోళన చేపట్టినా పోలీసులు వారిని తోసివేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం వచ్చి ఆందోళన నిర్వహించారు.

ప్రియాంక గాంధీ దూత వచ్చినా..

అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 45 రోజుల గడువు ఉండగా ప్రవళిక మృతిని అప్పటి ప్రతిపక్షం, నేటి అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ, బీజేపీలు అనుకూలంగా మలచుకున్నాయి. ప్రవళిక మృతిని దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతీ యువకుల మద్దతు కూడగట్టాయి. అప్పటి అధికార పక్షం, నేటి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం ప్రవళిక మృతిని పెద్దది చేయకుండా ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడి ప్రవళిక సోదరుడికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో ఆ పార్టీ నాయకులు చేతులు ఎత్తివేశారు. ప్రవళిక మృతి సమయంలో ప్రియాంకగాంధీ దూతగా ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ డాలీశర్మ స్వయంగా అక్టోబర్ 15న బిక్కాజిపల్లికి వచ్చి ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'ప్రియాంక గాంధీ నీకు తోడుగా ఉంటానని చెప్పమని నన్ను పంపింది' అని డాలీశర్మ ప్రవళిక తల్లి విజయకు చెప్పారు. ఇదే సమయంలో పీసీసీ అధికార ప్రతినిధి, నేటి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ప్రవళిక తల్లిదండ్రులు లింగయ్య, విజయలతో మాట్లాడించారు. 'పోయిన బిడ్డను తెచ్చి ఇవ్వలేం.. అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి' అని ధైర్యం చెప్పారు. నేడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏడు నెలలు దాటింది. ప్రవళిక కుటుంబం, ముఖ్యమంత్రికి గుర్తుకు రాలేదా అంటూ విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. నాటి, నేటి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దూతలుగా వచ్చి మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్‌లు నేడు ప్రవళిక కుటుంబ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తుంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించి ప్రవళిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూలీ పనులకు వెళ్తున్నా..

నా బిడ్డ చనిపోయి ఎనిమిది నెలలు దాటుతుంది. బిడ్డ చనిపోయినప్పుడు వేలాది మంది రోజు వచ్చిండ్లు. ఆదుకుంటామని ధైర్యం చెప్పిండ్లు. మీటింగ్‌లల్ల నాబిడ్డ పేరు చెప్పని నాయకుడు లేడు. ఎన్నికలు అయిపోయినయి. నన్ను ఎవళ్లు పట్టిచ్చుకుంటలేరు. చానామంది నాయకుల దగ్గరికి తిరిగిన. కాళ్లు ఏళ్లు మొక్కినా కనికరం లేదు. అప్పుడు ఇప్పుడు అంటున్నరు. బిడ్డ పోయినందుకు కొడుక్కు ఉద్యోగం ఇస్తం అన్నరు. ఇప్పుడు ఎవళూ ఏమీ చెబుతలేరు. రెక్కాడితిగాని డొక్కాడదు. అందుకు రోజు కూలీ పనులకు పోతున్న. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి సారు నా కొడిక్కి ఉద్యోగం, నాకు ఆర్థికసహాయం చేసి ఆదుకోవాలే.

– మర్రి లింగయ్య, ప్రవళిక తండ్రి

నిందమోపిండ్లు.. రుజువు చేయలే..

నాబిడ్డ చదువులో చాలా తెలివిగలది. ఏనాటికైనా గవర్నమెంట్ ఉద్యోగం సాధిస్తా అన్నది. ఉద్యోగం వచ్చినంకనే పెళ్లి అన్నది. పరీక్షల పేపర్‌లు లీక్ కాంగనే రంది పడ్డది. మళ్ల ఎప్పుడు పెడుతరో.. నౌకరి వస్తదో రాదో అని మదన పడేది. గుండె ధైర్యం చెడి ఆత్మహత్య చేసుకున్నది. చావుకు ప్రేమ కథ అల్లిండ్లు. నింద మోపిండ్లు. ఇప్పటికీ రుజువు చేయలే. కడుపు కాలుతుంది. క్షణంక్షణం బిడ్డ యాదికోస్తుంది. ఇప్పుడు మా ఇంటి వంక ఎవ్వలూ చూడటం లేదు. నా బిడ్డ పేరు చెప్పుకుని ఓట్లు సంపాదించుకున్నరు. గద్దెలు ఎక్కిండ్లు. నా బిడ్డ ఇప్పుడు ఎవ్వరికి గుర్తుకు లేదు.

– మర్రి విజయ, ప్రవళిక తల్లి

డీన్ అపాయింట్ డిలే!

- సర్వీస్ సీనియార్టీనా? ప్రొఫెసర్ సీనియార్టీనా?
- ఇద్దరు ప్రొఫెసర్లలో సీనియార్టీపై వివాదం
- కమిటీ వేసే యోచనలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి


కేయూలో సైన్స్‌తోపాటు వివిధ విభాగాల డీన్స్ కార్యాలయం..

కేయూ క్యాంపస్: కేయూ సైన్స్ డీన్ నియామకంలో యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. సైన్స్ డీన్‌గా కొనసాగుతున్న గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్, ప్రస్తుత కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి సైన్స్ డీన్ పదవీకాలం గత నెల 31న ముగిసింది. 21 రోజులు గడిచినా.. మరో ప్రొఫెసర్‌ను డీన్‌గా నియమించలేదు. సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ వైవాలు, సెమినార్ల నిర్వహణ బాధ్యతలతోపాటుగా కీలకమైన సెనెట్‌లోనూ, స్టాండింగ్ కమిటీలోని సభ్యుడిగా కూడా డీన్ కొనసాగుతారు. అలాంటి కీలకమైన పదవి నియామకంలో జాప్యం జరగడం యూనివర్సిటీలోని ప్రొఫెసర్లలో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరిలో ఎవరిని నియమించాలి?

డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ మల్లారెడ్డి తర్వాత సైన్స్ విభాగాల్లో ఎవరు సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారో ఆ ప్రొఫెసర్‌ను డీన్‌గా నియమించాల్సి ఉంటుంది. అయితే కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ జి.హనుమంతు, ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని నియమించాలి. వీరిలో ఎవరిని నియమిస్తారనేది ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. మొదట సర్వీస్‌లో జాయిన్ అయినప్పటి నుంచి సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలా? లేక పదోన్నతి పొందినప్పటి నుంచి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. కాగా.. గతంలో ఈ రెండు విధానాలనూ అనుసరించడంతో ప్రస్తుతం ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. రెండేళ్ల క్రితం అప్పటి వీసీ తాటికొండ రమేశ్ సర్వీస్‌లో మొదట జాయిన్ అయిన అంశాన్ని సీనియార్టీగా కాకుండా ప్రొఫెసర్‌గా నియమితులైన తర్వాత సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని సైన్స్ డీన్‌గా గణిత శాస్త్ర విభాగం ఆచార్య పి.మల్లారెడ్డిని నియమించారు.

కమిటీ వేయాలని యోచన!

కాగా.. కాకతీయ యూనివర్సిటీలో ఇప్పటికీ రెండు విధానాలను అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సర్వీస్ సీనియార్టీని, మరికొన్ని సందర్భాల్లో ప్రొఫెసర్ అయిన వారి సీనియార్టీని డీన్‌లుగా నియమించినట్లు తెలుస్తోంది. కేయూ సైన్స్ డీన్‌గా ఎవరిని నియమించాలో తేల్చుకోలేకపోతున్న కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఈ విషయాన్ని కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం సైన్స్ డీన్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై ఓ కమిటీ వేయాలనే యోచనలో రిజిస్ట్రార్ ఉన్నట్లు సమాచారం. ఆఇద్దరు ప్రొఫెసర్లలో ఒకరిని నియమించేవరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డినే సైన్స్ డీన్‌గా అంటిల్‌ఫర్‌దర్ ఆర్డర్‌పై కొనసాగిస్తున్నారు. అయితే కమిటీలో ఉండాలని ఇద్దరు ముగ్గురిని సంప్రదించినా ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం.

యూనివర్సిటీ యాక్ట్‌లో ఏముందంటే..

యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం.. డీన్ అయ్యేవారు ప్రొఫెసర్ అయి ఉండాలని రోటేషన్ ప్రకారం అని మాత్రమే ఉందని తెలుస్తోంది. డీన్‌ల నియామకంలో యూనివర్సిటీ యాక్ట్‌లో నిర్దిష్టమైన విధానం లేకపోవడం వల్ల వీసీలుగా బాధ్యతలను నిర్వర్తించినవారు తమ విచక్షణతోనే ఒక విధానం అంటూ కాకుండా.. రెండు విధానాలు అనుసరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీసీగా వాకటి కరుణ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

లింగ నిర్ధారణ పరీక్షల ముఠా అరెస్ట్

- గర్భస్రావాలకు పాల్పడుతున్న దుండగులు
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. నిందితులు కాజీపేట కడిపికొండకు చెందిన బస్కె స్రవంతి, ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన కాసిరాజు దిలీప్, హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన జంగా రజమని, వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఏకుల నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రధాన నిందితురాలు బస్కె స్రవంతి గతంలో హనుమకొండలో ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మరో నిందితురాలు రాజమని తన సమీప బంధువుకు లింగనిర్ధారణ పరీక్షలు చేయాల్సిందిగా స్రవంతిని కోరింది. దీంతో ఆమె హనుమకొండలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న మరో నిందితుడు కాసిరాజు దిలీప్ సహకారంతో హనుమకొండ వేయిస్తంభాల గుడి ప్రాంతంలో సదరు బాధిత మహిళకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాడు. ఇందులో బాలికని నిర్ధారణ కావడంతో సదరు మహిళకు గర్భస్రావం చేయించాల్సిందిగా రాజమణి.. స్రవంతిని కోరింది. దీంతో కాశిబుగ్గలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న మరో నిందితుడు నరేశ్ వద్ద నుంచి గర్భస్రావం అయ్యేందుకు టాబ్లెట్ ఇచ్చారు. ఈ టాబ్లెట్ వేసుకున్న బాధిత మహిళకు ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అందించడానికి హనుమకొండలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి రాజమణి.. స్రవంతి తప్పించుకున్నారు. బాధిత మహిళ ఈ విషయం డాక్టర్‌కు తెలపడంతో సదరు డాక్టర్.. జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి స్కానింగ్ మిషన్, ద్విచక్రవాహనం, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితురాలు స్రవంతి గతంలోనూ ఇదే తరహాలో గర్భస్రావానికి పాల్పడంతో ఆమెపై ఐదు కేసులు నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కూలి పనికి వచ్చి మృత్యుఒడికి ..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- ముగ్గురికి గాయాలు.. పాంనూర్‌లో ఘటన
- అధికారుల నిర్లక్ష్యమే కారణం : మృతుడి బంధువుల ఆరోపణ


రోదిస్తున్న మృతుడి భార్య, బంధువులు
సోమన్న మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ తీగలు లాగే కూలి పనికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని పాంనూర్‌లో జరిగింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. పాంనూర్‌లో గత నెలలో ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో మరమ్మతుల్లో భాగంగా అధికారుల విద్యుత్ తీగలు లాగే పనులు చేయిస్తున్నారు. ఈ పనులకు పాలకుర్తి మండలం కొండాపూర్ శివారు హనుమాన్‌తండాకు చెందిన బానోత్ సోమన్న(30)తోపాటు మరో నలుగురు కూలీలు వచ్చారు. అయితే సంబంధిత అధికారులు ఎల్‌సీ తీసుకోకుండానే పనులు చేయించారు. గ్రామంలో ఉండే ఎల్‌సీ ఫ్యూజ్ సెట్ (ట్రాన్స్‌ఫార్మర్ జంపర్) కట్ చేసి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు లాగుతుండగా సోమన్నతో పాటు మరో ముగ్గురు లావుడ్య రమేశ్, బానోత్ సుమన్, దండిగ సింహాద్రికి షాక్ కొట్టింది. దీంతో వారు గాయపడగా వెంటనే చికిత్స నిమిత్తం ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే సోమన్న అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పార్వతి, ఐదేళ్ల, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతుడి బంధువుల నిరసన..

విద్యుదాఘాతంతో సోమన్న మృతిచెందిన సమాచారం తెలుసుకున్న మృతుడి భార్య, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని, వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు


పీఎస్ఓ సిబ్బందితో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్

● అదనపు డీసీపీ సురేశ్ కుమార్

వరంగల్ క్రైం: వ్యక్తిగత భద్రతా సిబ్బంది విధుల్లో అలసత్వం వహించొద్దని, నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వ్యక్తిగత భద్రతా సిబ్బందికి మంగళవారం కమిషనరేట్‌లో ఒక రోజు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌చార్జి, డీఎస్పీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు బాంబు నిర్వీర్యం విభాగం నిర్వహించాల్సిన విధులు, పీఎస్ఓ భద్రత కల్పిస్తున్న వ్యక్తులను శత్రువుల నుంచి సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ భద్రతా సిబ్బంది ముఖ్యంగా వీఐపీలకు భద్రత కల్పిస్తున్న సమయంలో అనుక్షణం పరిసరాలను పరిశీలించడంతో పాటు, వేగంగా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. వీటితో పాటు భద్రతా సిబ్బంది అన్ని రకాల ఆయుధాలు వినియోగించడంలో నిష్ణాతులైై ఉండాలని, దేహదారుఢ్యం, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు భద్రతా సిబ్బంది నిరంతరం యోగా లేదా శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఆర్‌ఐలు స్వర్ప రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు శోభన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, కూకట్‌పల్లికి ఏసీ బస్సులు

- శ్రీశైలానికి సూపర్ లగ్జరీ
- ఆర్టీసీ వరంగల్–1 డీఎం మోహన్ రావు



హన్మకొండ: హనుమకొండ నుంచి గుంటూరు, హైదరాబాద్ కూకట్‌పల్లికి అదనంగా ఏసీ రాజధాని బస్సు నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తెలిపారు. అదే విధంగా శ్రీశైలానికి అదనంగా సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నామన్నారు. బుధవారం నుంచి ఈ బస్సులు ప్రయాణికుల సేవల్లోకి రానున్నాయన్నారు. హనుమకొండ నుంచి గుంటూరుకు రోజూ ఉదయం 7 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. గుంటూరు నుంచి హనుమకొండకు ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు బస్సు బయలుదేరుతుందని వివరించారు. హనుమకొండ నుంచి కూకట్‌పల్లికి రోజూ ఉదయం 5.30, సాయంత్రం 4.15 గంటలకు, కూకట్‌పల్లి నుంచి హనుమకొండకు ఉదయం 5 గంటలకు, 10 గంటలకు రాజధాని బస్సు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి శ్రీశైలానికి ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు, శ్రీశైలం నుంచి హనుమకొండకు ఉదయం 7.40 గంటలకు, 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. భక్తులు, పర్యాటకులు, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుఖవంతమన్నారు. క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు.

గూడ్స్ ఆటోను ఢీకొన్న కారు

- గూడ్స్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- కాచికల్ శివారులో ఘటన


సుధాకర్‌రెడ్డి మృతదేహం

నెల్లికుదురు: గూడ్స్ ఆటోను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గూడ్స్ ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాచికల్ శివారు ఇటుకల బట్టీల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాండ్ల సుధాకర్‌రెడ్డి (45) తొర్రూరు మండల కేంద్రంలోని అమృత బ్రెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన సొంత గూడ్స్ ఆటోలో బ్రెడ్ ప్యాకెట్లను నెల్లికుదురు, తొర్రూరు మండలాల్లో సప్లై చేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తొర్రూరు నుంచి బ్రెడ్ ప్యాకెట్లతో బయలుదేరి నెల్లికుదురు వైపునకు వస్తున్నాడు. కాచికల్ శివారు ఇటుకల బట్టీల సమీపంలో కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గోల్యా తండాకు చెందిన మాలోతు వెంకటేశ్ కారును అజాగ్రత్తగా నడుపుతూ గూడ్స్ ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో గూడ్స్ ఆటో పల్టీకొట్టి రోడ్డు పక్కనున్న పొలంలో పడింది. ఈ ప్రమాదంలో సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాంత్రికిరణ్ వివరించారు.

అమృత్ భారత్ పనుల్లో వేగం పెంచాలి

- ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం
- దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్‌కుమార్ జైన్
- మహబూబాబాద్, డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో తనిఖీలు


డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం భరతేష్‌కుమార్ జైన్

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్: అమృత్ భారత్ పనుల్లో వేగం పెంచాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వే శాఖ కృషి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్ వైపున జరుగుతున్న అభివృద్ధి పనులు, సిగ్నల్ వ్యవస్థ, రికార్డులు, బుకింగ్ కార్యాలయం, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాళ్లు, ఇతర కార్యాలయాల నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.40 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే, డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోనూ భరతేష్‌కుమార్‌జైన్ తనిఖీలు నిర్వహించారు. అనంతరం డోర్నకల్ క్రూ లాబీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెఫ్టీ సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. పైలెట్లు, లోకో పైలెట్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి రైలు ప్రమాదాలను నివారించాలన్నారు. అనంతరం గార్ల గేటు వద్ద నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. కాగా, డోర్నకల్ మీదుగా నడుస్తూ రద్దయిన రైళ్లను పునరుద్ధరించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు మైనుపాషా, ఖాదర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సమేర్‌చంద్ జైన్, స్థానిక వ్యాపారులు మహేందర్‌కుమార్‌జైన్, పదమ్‌కుమార్‌జైన్, లచ్చు నాయక్ తదితరులు.. డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఆర్‌ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాల్ నాయక్, సీనియర్ డీఓఎం మణికుమార్, సీనియర్ డీసీఎం బాలాజీకిరణ్, సీనియర్ డీఎస్‌ఓ సురేశ్, స్టేషన్ మాస్టర్ కనకరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ కుమార్, కమర్షియల్ మేనేజర్ రాజగోపాల్, సీనియర్ డీఆర్‌ఎస్‌ఓ చైతన్య, స్టేషన్ సూపరింటెండెంట్ శోభన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.